క్లుప్తంగా

బంగారమ్మ జాతర మహోత్సవం



పూజల్లో భక్తజనం

శివ్వంపేట(నర్సాపూర్): బంగారమ్మ జాతర మహోత్సవం కనుల పండువగా కొనసాగుతోంది. మూడు రోజులపాటు జరిగే జాతర తొలిరోజు అటవీలో కొలువైన అమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. రెండోరోజైన సోమవారం గ్రామంలోని లింగమయ్యకు పూజలు చేశారు. బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చివరిరోజు ఎల్లమ్మకు బోనాలు సమర్పిస్తారు.

సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27, 28వ తేదీల్లో చేపట్టనున్న సమ్మెను పంచాయతీ కార్మికులు విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పిలుపు ఇచ్చారు. సోమవారం సమ్మె నోటీసును ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, జీఓ నంబర్ 51 ని రద్దు చేసి జీఓ 60ను అమలు చేయాలని కోరారు. అలాగే కార్మికులను పర్మినెంట్ చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు స్వామి, శ్రీకాంత్, మహేశ్, లక్ష్మి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఈఓ శశిధర్

శివ్వంపేట(నర్సాపూర్): సీసీ రోడ్డు నిర్మాణ పనులను సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఈఓ శశిధర్ సోమవారం ప్రారంభించారు. ఈఓ తన సొంత నిధులతో పాటు హైదరాబాద్‌కు చెందిన సురేశ్, బబీత, అశ్వర్థన్‌రావు, శ్రీధర్‌రావు దాతలు అందించిన ఆర్థిక సహాయంతో ఆలయ గుట్ట ప్రాంతంలో నిర్మాణం చేపడుతున్నారు. ఆలయ అభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సాయం గొప్పదన్నారు. దశలవారీగా ప్రధాన రోడ్డు నుంచి ఆలయం గుట్ట వరకు సీసీ నిర్మాణం చేపట్టేందుకు దాతల సహాయం కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, జూనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి, విద్యాకర్‌చారి తదితరులున్నారు.

విద్యార్థి వైద్యానికి రూ.లక్ష సాయం



విద్యార్థి తండ్రికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థి వైద్యానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఆదివారం ఉపాధ్యాయులు అందజేశారు. యశ్వంతరావుపేటకు చెందిన బ్యాగరి వంశీ పాఠశాల నుంచి కాలినడకన ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురికావడం, ఆ తర్వాత హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటం తెలిసిందే. దీంతో విద్యార్థి కుటుంబానికి మంగళపర్తి ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు రూ.1.03 లక్షలను వంశీ తండ్రి శ్రీనివాస్‌కు అందజేశారు. ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

దుబ్బాకటౌన్/సిద్దిపేటకమాన్: దుబ్బాక పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం నిర్వహించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దుబ్బాక డిపో ఇన్‌చార్జి మేనేజర్ సుఖేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను 99592 26271 నంబర్లో తెలపాలని పేర్కొన్నారు.

వైజ్ఞానికం.. విజ్ఞానం



కౌడిపల్లి మండలం రాజిపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు 1729 ఆకృతిలో ప్రదర్శన చేశారు. శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గణిత సూత్రాలు, ఇతర ఉపకరణాలు తయారు చేసి ప్రదర్శించారు. – కౌడిపల్లి(నర్సాపూర్)



చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాలలో సోమవారం గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నశంకరంపేట(మెదక్)

బైక్‌ను ఢీకొన్న బొలెరో

ఒకరి మృతి

నర్సాపూర్‌రూరల్: బైక్‌ను బొలెరో ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి నర్సాపూర్ అటవీ ప్రాంతం అర్బన్‌పార్క్ సమీపంలో జరిగింది. నర్సాపూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బైక్‌ను నర్సాపూర్–హైదరాబాద్ 765 హైవేపై ఎదురుగా వస్తున్న బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై నర్సాపూర్ ఎస్ఐ లింగాన్ని వివరణ కోరగా.. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన నిజమేనన్నారు. మృతుడి పేరు వివరాలు తెలియరాలేదన్నారు.

కొత్త పంచాయతీలకు భవనాలేవి?

- అద్దె, కమ్యూనిటీ, పాఠశాల భవనాల్లోనే కొనసాగింపు
- ఇబ్బందుల్లో సిబ్బంది, గ్రామాల ప్రజలు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకోవాలని వినతి

కొన్నేళ్ల క్రితం కొత్త పంచాయతీలు ఏర్పాటు చేశారు కానీ భవన నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాల భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఈ అంశాలపై గతంలోనే ప్రభుత్వ అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సరైన సదుపాయాలు లేక సిబ్బంది, కార్యాలయ పనుల నిమిత్తం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వమైనా దృష్టిసారించాలని కోరుతున్నారు.



పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన గొల్లపల్లి తండా పంచాయతీ కార్యాలయం

చేగుంట (తూప్రాన్): ప్రత్యేక రాష్ట్రం అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సౌలభ్యం దృష్ట్యా తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి పరిపాలన సాగిస్తున్నారు. అయితే తండాల్లో ప్రభుత్వ సొంత భవనాలు ఇప్పటికీ నిర్మించకపోవడంతో ఇతర భవనాల్లో పంచాయతీ కార్యాలయాలను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని నడిమితండా, గొల్లపల్లి తండాను గ్రామ పంచాయతీలుగా గుర్తించగా ఇప్పటికీ గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం జరగలేదు. గ్రామ పంచాయతీలను పాఠశాల భవనాలు, కమ్యూనిటీ భవనాల్లో కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సైతం అద్దె భవనాల్లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తండాల్లో గ్రామ పంచాయతీ భవనాలతో పాటు మౌలిక వసతులను కల్పించాలని గత ప్రభుత్వ హయాంలో తండావాసులు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదు. ప్రస్తుత ప్రభుత్వ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ, ఎమ్మెల్సీ కోదండరాంతో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు గ్రామ పంచాయతీ భవనం, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం భవనాలను నిర్మించాలని తండావాసులు వినతిపత్రాలు అందించారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు గిరిజన తండాల అభివృద్ధిపై చొరవను తీసుకొని తండాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

నాలుగేళ్లుగా విన్నవిస్తున్నాం..



మండలంలోని గొల్లపల్లి తండా గ్రామ పంచాయతీలో రోడ్లు, గ్రామపంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించాలని నాలుగు సంవత్సరాలుగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. తండాల అభివృద్ధికి చొరవ తీసుకోకపోవడంతోనే అభివృద్ధి జరగడం లేదు.

– సుభాష్‌నాయక్, జెత్రంతండా

నిధులు ఇవ్వలేదు



సర్వసభ్య సమావేశాల్లో తండాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరిన ప్పటికీ మంజూరు చేయలేదు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కూడా అందలేదు. కేవలం నాయకులు తండాల అభివృద్ధి గురించి మాట్లాడటం తప్ప చేసిందేమీ లేదు.

– మాజీ ఎంపీటీసీ హూలియా నాయక్, నడిమితండా

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



అంగన్‌వాడీ సమావేశం నిర్వహిస్తున్న సీడీపీఓ హేమభార్గవి

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను సక్రమంగా అందించాలని సీడీపీఓ హేమభార్గవి అన్నారు. సోమవారం శివ్వంపేట రైతు వేదికలో నర్సాపూర్ నియోజకవర్గ ప్రాజెక్టుస్థాయి అంగన్‌వాడీ టీచర్లకు సమావేశం నిర్వహించారు. టీచర్లు సమయపాలన పాటించాలని, ఆహారం అందించడంలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలపాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. ప్రతినెలా నాలుగో శనివారం తప్పకుండా ఈసీసీఈ డే నిర్వహించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యధోరణి అవలంబించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్, సూపర్‌వైజర్లు సంతోష, సరళకుమారి, వసుమతి, శివకుమారి, సంతోషిమాత, లక్ష్మీనర్సమ్మ, లక్ష్మీ, సునీతాదేవి, హుమార్‌సుల్తానా, సుజాత, మైహిత బేగం తదితరులు ఉన్నారు.

పరిశోధనల్లో దేశానిది కీలక పాత్ర



సదస్సులో అతిథులు, కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: ఫార్మా టెక్నాలజీ, ఇంజనీరింగ్ టెక్నాలజీ రంగాల్లో నూతన ప్రాజెక్టుల తయారీ, కొత్త పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయని, వాటిలో ఇండియా కీలక పాత్ర పోషిస్తోందని జపాన్ కూమాంటో వర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ తాకాసి వాటానాబీ చెప్పారు. సోమవారం స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించే రెండు రోజుల అంతర్జాతీయ స్థాయి సదస్సు ప్రారంభోత్సవంలో ఆయనతోపాటు ప్రొఫెసర్ యాకియో నగానో మాట్లాడారు. మానవాళి అవసరాలు ఫార్మా రంగంతో ముగిపడి ఉన్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా రంగంలో విశిష్ట పరిశోధనలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో చేపట్టే పరిశోధనలకు వర్శిటీ పూర్తి సహకారం అందిస్తున్నదన్నారు. హెచ్‌యూడబ్ల్యూఈఎల్ లైఫ్ సైన్స్ కంపెనీ సీఈఓ డాక్టర్ రచనా త్రిపాఠి మాట్లాడుతూ ఫార్మారంగంలో మానవాళికి అవసరమైన డయాగ్నస్టిక్ ఉత్పత్తులను తమ కంపెనీ ఉత్పత్తి చేసి ప్రపంచానికి అందిస్తోందన్నారు. ఈ రంగంలో గొప్ప ఆవిష్కరణలు నూతన పరిశోధనలు చాలా ముఖ్యమని చెప్పారు. కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, కాలేజీ చైర్మన్ విష్ణురాజు ముందు చూపుతో సంప్రదాయ కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, మేనేజర్లు అశోక్ రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

మెదక్‌జోన్: ఏసు క్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శనమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం మెదక్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ సెలబ్రేషన్స్‌లో కేక్ కట్ చేసిన ఆయన క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు ఒక మతానికి సంబంధించినవి కావని, యావత్తు మానవాళికి మార్గదర్శకమని అన్నారు. ఏసు మనుషులను ప్రేమించాలని, వారి తప్పులను క్షమించాలని ప్రపంచానికి బోధించిన శాంతి దూత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెదక్ చర్చి అభివృద్ధి కోసం రూ.30 కోట్ల నిధులను కేటాయించిందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ చంద్రపాల్, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జామాల నాయక్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా మోహన్



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ యూటీఎఫ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మోహన్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఆదినారాయణ, కోశాధికారిగా మధులత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని అన్నారు. నూతన విద్యా విధానం, సీపీఎస్ విధానం రద్దు చేయాలన్నారు. ఈనెల 28, 29, 30వ తేదీలో నల్గొండలో జరగనున్న రాష్ట్ర 6వ మహాసభలకు ఉపాధ్యాయులు భారీగా హాజరై జయప్రదం చేయాలన్నారు. యూటీఎఫ్ కమిటీ సభ్యులు రమేశ్, పద్మజ, అజయ్‌కుమార్, కీర్తిరెడ్డి, శ్రీకాంత్, కవిత, రాజేశ్, శారద పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

తూప్రాన్: ఆటో, స్కూటీ ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్ఐ యాదగిరి సోమవారం తెలిపారు. పట్టణంలోని కరీంగూడకు చెందిన పల్లపు అశోక్ (39) ఈనెల 10న పోతరాజుపల్లి సమీపంలో ఆటో ఢీకొని తలకు తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్



నర్సాపూర్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్, విద్యార్థులు

నర్సాపూర్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని స్థానిక సీఎస్ఐ చర్చిలో సోమవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చర్చి ఫాదర్ రెవరెండ్ దార సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సండే స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఏసు పుట్టుక అంశంపై ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రభుత్వం తరఫున క్రిస్మస్ ఫీస్ట్ మంగళవారం సాయికృష్ణ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి రానున్నారని చెప్పారు.

హక్కుల కోసం నిరంతర పోరాటం



మాట్లాడుతున్న నర్సింహులు గౌడ్

చేగుంట(తూప్రాన్): గౌడజన హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులుగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద సమావేశం నిర్వహించి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. గౌడజనులకు అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతామన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆకుల మల్లేశంగౌడ్, ఉపాధ్యక్షుడిగా యాదగిరిగౌడ్, మహిళ జిల్లా అధ్యక్షురాలిగా నాగదేవత, ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, రేవతి, ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక, కోశాధికారిగా నవనీతలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలరాజుగౌడ్, సిద్ధిరాములు గౌడ్, బాలేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ట్రాన్స్‘ఫార్మర్’ కష్టాలు



చందంపేట గ్రామంలో పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

ఇప్పటికే మూడుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోగా ట్రాక్టర్ ద్వారా ట్రాన్స్ కో కార్యాలయానికి తరలించి మరమ్మతులు చేయించామని చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామ రైతులు వాపోయారు. సోమవారం మరోసారి పాడైపోయిందని తెలిపారు. సమస్య ఏమిటో తెలియడం లేదని, ఈ విషయమై ట్రాన్స్‌కో అధికారులు స్పందించడం లేదని వాపోయారు. నారు నాటుకోలేక పోతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్తది ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో పాత దానికి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు. – చిన్నశంకరంపేట(మెదక్):

సంక్షిప్త వార్తలు

◆ కనీస సౌకర్యాలు కోసం వినతి



పాపన్నపేట(మెదక్): తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఈఓ చంద్రశేఖర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఏడుపాయల్లో డార్మెటరీలు, మరుగుదొడ్లు, రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని బీజేపీ మండల నాయకులు సంతోషచారి, భాగేశ్, గౌస్‌పాషా, లక్ష్మణ్‌రావు, శ్రీధర్‌రావు, రాంచందర్, జగదీశ్‌రాజు కోరారు. సీఎం తొలిసారిగా ఏడుపాయలకు రాబోతున్న సందర్భంగా భారీ నిధులు మంజూరు చేయాలన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు



నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కొల్చారం, చిలప్‌చెడ్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు 3 లక్షల 86 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పథకంతో పేదలకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నేడు ‘డివిజన్’ కోసం బైక్ ర్యాలీ

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం వరకు తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం స్థానిక సుభాష్ చంద్రబోస్ విగ్రహం హనుమాన్ టెంపుల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

◆ బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

హవేళిఘణాపూర్(మెదక్): బాధిత కుటుంబానికి నీల స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని మద్దుల్‌వాయి గ్రామానికి చెందిన కుటుంబానికి గజ్జెల యేసు గుడిసె ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న మోహన్.. నిత్యావసరాలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వంశీ, రమేశ్, సురేశ్ నాయక్, శ్రీనునాయక్, రమేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ అయ్యప్ప మహాపడి పూజ



మనోహరబాద్‌త(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లో సోమవారం అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. మాజీ సర్పంచ్ నత్తి మల్లేశ్ మాజీ ఎంపీటీసీ లావణ్యలు ఆధ్వర్యంలో గురుస్వామి ప్రభాకర్‌గౌడ్ పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్, రామంచ, అల్లీపూర్, గోనెపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బత్తుల మల్లేశం మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు.

◆ దుబ్బాకలో బీజేపీ బలోపేతం

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ఎంపీ రఘునందన్ రావు నాయకత్వంలో కృషి చేస్తామని బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి రమేశ్‌రెడ్డి, ఎన్నికల నిర్వహణ అధికారి శ్రీకాంత్ యాదవ్ అన్నారు. 42వ బూత్ కమిటీ బీజేపీ అధ్యక్షుడుగా బెల్లె సంజీవులును సోమవారం ఎంపిక చేశారు.